ప్రజాశక్తి

శనివారం 8 ఫిబ్రవరి 2025

5

అల్లూరి సీతారామరాజు



నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు కృషి చేద్దామని స్థానిక వైద్యాధికారి పి రాంబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలను వేయించాలన్నారు. చిన్నారుల ఎదుగుదలకు తోడ్పాటునందిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి

మన్యం బంద్‌ను జయప్రదం చేయాలి



పాడేరులో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి-పాడేరు: 1/70 చట్టాన్ని సవరించాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ ఆదివాసి అఖిలపక్ష ప్రజా సంఘాలు ఈనెల 11 12 తేదీల్లో నిర్వహిస్తున్న 48 గంటల బందుకు ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన స్తానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బంద్‌ను విజయవంతం చేసేందుకు ఫిబ్రవరి 10న అన్ని మండల కేంద్రములలో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో 1/70 చట్టం పరిరక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్ట సవరణ పై ప్రభుత్వ పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. దీన్ని వ్యతిరేకిస్తూ తలపెట్టిన మన్యం బందును విజయవంతం చేసి ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసేందుకు ఆదివాసి ప్రజా సంఘాలన్నీ ఏకం కావాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు బందుకు సహకరించాలని కోరారు.

అలాగే ఒరిస్సా రాష్ట్ర ముఖ్యమంత్రి బీజేపీ నాయకుడు మోహన్ మజ్జి ఆదివాసీ మహిళపై కించ పరుస్తూ చేసిన వ్యాఖ్యలను ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కిల్లో సురేంద్ర తీవ్రంగా ఖండించారు. ఆదివాసీ మహిళలు అందంగా ఉండరు.. నల్లగా ఉంటారు.. అందుకే పెళ్లి చేసుకో లేదని హీనంగా మాట్లాడే వ్యక్తికి ముఖ్య మంత్రి పదవిలో ఉండే అర్హత లేదని తక్షణమే రాజీనామా చెయ్యాలని లేదా ముఖ్య మంత్రి పదవి నుండి బర్రఫ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రజలు బందులో పాల్గొని సంపూర్ణ విజయ వంతం చెయ్యాలని పిలుపు పిచ్చారు ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఏస్, పుణ్యవతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.త్రినాధ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

పాడేరుటౌన్: 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 11, 12న తలపెట్టిన మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం జీపు, ఆటో యూనియన్‌ల నాయకులను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు కె.సురేష్‌కుమార్, బోంజుబాబు, సురేష్ కుమార్, రాధాకృష్ణ, ఎం శ్రీను, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెసా కమిటీ సంపూర్ణ మద్దతు

అరకులోయ రూరల్: 1/70 చట్టాన్ని సవరణపై స్పీకర్ అయ్యన పాత్రుడు వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటన చేయాలని పెసా కమిటీ కార్యదర్శి, పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ నెల 11,12 తేదీలో ఆదివాసి అఖిలపక్ష ప్రజా సంఘాల అధ్వర్యంలో చేపడుతున్న మన్యం రాష్ట్ర బంద్‌కు అరకువేలి మండల పెసా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు శుక్రవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా పెసా కమిటీ కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసీ హక్కులు చట్టాలు జోలికొస్తే సహించేదని చెప్పారు. రాజ్యాంగ బద్ధమైన శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న అయ్యన్న పాత్రుడు ఆదివాసీ చట్టాలను కాపాడాల్సింది పోయి టూరిజం అభివృద్ధికి ఆదివాసీ చట్టాలు అడ్డు వస్తున్నాయని చెప్పడం సరికాదన్నారు. షెడ్యూల్ ఏరియాలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిపికేషన్ ప్రకటించాలని, పాడేరు మెడికల్ కాలేజీలో స్థానిక ఆదివాసులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పెసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు సుంకరి ఆనంద్, ఎం.రమేష్, కె.జగన్నాథం, ఎన్ ప్రసాద్, కె రామన్న, రామారావు, గురుమూర్తి, దాశరది, నాగులు, గురు, జె.సురేష్, అర్జున్ పాల్గొన్నారు.



చింతూరులో మాట్లాడుతున్న సురేష్

అల్లూరి జిల్లా :

ఏజెన్సీలో 1/70 చట్ట సవరణ చేపట్టాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ గిరిజన సంఘాలు పిలుపు మేరకు ఈ నెల 11, 12తేదీల్లో జరుగు 48ల గంటల మన్యం బందును జయప్రదం చేయాలని ఏపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. చింతూరు మండలం కేంద్రంలో శుక్రవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ స్పీకర్‌గా ఉన్న వ్యక్తి ఆదివాసీల చట్టాలను హక్కులను కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపద, సహజ వనరులను దోచిపెట్టేందుకు ఆదివాసీల చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అయ్యన్న వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ముట్టం రాజయ్య, సోడే లెనిన్, కారం సుబ్బారావు, పాంద్రు నాగార్జున, పాంద్రు సుబ్బారావు, బీరబోయిన దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



అరకులో ప్రచారం చేపడుతున్న నాయకులు



మాట్లాడుతున్న అప్పలనర్స

రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదించిన

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టును నవయుగ కంపెనీకి అప్పగిస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడంపై సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స వెల్లడించారు. ఏజెన్సీలో అమలవుతున్న 1/70 చట్టాన్ని సవరించాలనే వ్యాఖ్యలను నేటి రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం బలపరుస్తున్నట్లుగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు శుక్రవారం స్థానిక సి.పి.ఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కిల్లో మొస్య, ఎస్.సుందరావు, కె.రామరావుతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతాల్లో ప్రవేట్ కంపెనీలకు సహజ వనరులు కట్టబెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అనంతగిరి మండలం నిమ్మలపాడు మైనింగ్ లీజును రద్దు చేయాలని సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌లో తీర్పు ఇస్తూ ప్రభుత్వానికి షెడ్యూల్డు ఏరియాలో లీజ్‌కి ఇచ్చే అధికారం లేదని, నాటి మైనింగ్ ఒప్పందాన్ని రద్దు చేసిందన్నారు.నాడు కూడి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వమేనని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పులను కూడా గౌరవించకుండా అడ్డగోలుగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లొంగి ప్రవేట్ సంస్థలకు ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరులను అప్పగించడం అన్యాయ మన్నారు. ఇప్పటికే 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన పాత్రుడు వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం బలపరుస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్టును ప్రవేట్ సంస్థలకు కేటాయించడం దారుణమన్నారు. పిసా చట్టాన్ని దిక్కరించడం సరికాదన్నారు.గ్రామ సభ అభిప్రాయాలను కూడా తీసుకోలేదని. గిరిజన సలహా మండలి (టి.ఏ.సి) ఆమోదం కూడా లేదని, గత ప్రభుత్వ వైఖరికి, నేటి ప్రభుత్వం వైఖరికి ఏమి తేడా లేదని ఆదివాసీ సంపదను దోచిపెట్టడమే లక్ష్యంగా పాలన ఉందని అన్నారు. ఆదివాసీ వ్యతిరేక విధానాలపై తీవ్రమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీ చట్టాలను, హక్కులను ప్రభుత్వం ఉల్లగిస్తున్న తీరుపై రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకోవాలన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామంలో శుక్రవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పరిసరాల్లో చెత్తను ఎత్తి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణ, సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

లింగ నిర్ధారణ చేసిన వారిపై కఠిన చర్యలు

- రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల వారు ప్రసవానికి ముందు ఆడ, మగ అనే లింగ నిర్ధారణ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని రంపచోడవరం సబ్ కలెక్టర్, లింగ నిర్ధారణ నిర్మూలన కమిటీ చైర్మన్ కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆమె శుక్రవారం లింగ నిర్ధారణ నిర్మూలన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 18004253365కు ఫిర్యాదు చేయాలని కోరారు. కూతురు అంటే ఒక ఆణిముత్యమని ఆమె పేర్కొన్నారు. ఏజెన్సీలోని బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. పిల్లలు పుట్టిన వెంటనే కాకుండా రెండు సంవత్సరాల దాటిన తర్వాత గర్భం దాల్చే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ నిబంధన ప్రకారం సమావేశాలు ఎప్పుడు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ షాపుల్లో ఏ మందులు అమ్ముతున్నది, లైసెన్సులు ఉన్నది లేనిది పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో బాలికలు టీనేజీ గర్భాలు దాల్చకుండా, వారు చదువుపై దృష్టి పెట్టే విధంగా ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. టీనేజీ గర్భాలను ప్రోత్సహించిన వారిపై సెక్షన్ 6 ప్రకారం పోక్సో కేసులు పెట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఏజెన్సీలోని ప్రతి గ్రామంలోనూ వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిపి పి.రవీంద్ర, ఎస్ఐ వి.వెంకటరావు, సిడిపిఓ సంధ్యారాణి, ఎంపీహెచ్ఓ పీటర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పల్లాల అరుణకుమారి, కోసూరి లోవశ్రీ, హెల్త్ సూపర్వైజర్ సీత, ఫార్మసీ అధికారి బి.మార్గదర్శి, ఆరోగ్య విస్తరణ అధికారి వై లవకుశ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మృతి

ప్రజాశక్తి కొయ్యూరు : కొయ్యూరు మండలంలోని మర్రిపాకలు అటవీ రేంజ్ పరిధిలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్న ఆర్.పుట్టన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నర్సీపట్నంలో నివాసముంటున్న పుట్టన్న శుక్రవారం విధులకు వస్తున్న సమయంలో నర్సీపట్నంలో బస్సు ఢీకొనడంతో పుట్టన్న అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పుట్టన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి ఫారెస్టు సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.



పుట్టన్న (ఫైల్‌ఫొటో)



సత్కరిస్తున్న చైర్మన్లు

రవాణా శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసిన చైర్మన్లు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: రాష్ట్ర రవాణ, భవనముల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ను సచివాలయ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్లు రెడ్డి అప్పల నాయుడు, దొన్ను దొర, సురేష్ రెడ్డి, పోలా నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర రవాణా యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డిని సచివాలయంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ జోన్ పరిధిలో నెల కొన్న సమస్యలపై చర్చించారు.

పిఒ అభిషేక్ సేవలు అభినందనీయం

- కలెక్టర్ దినేష్ కుమార్ - ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: బదిలీపై వెళుతున్న ఐటిడిఏ, పి.ఓ. వి.అభిషేక్ సేవలు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ కొనియాడారు. గిరిజన ప్రాంతం అభివృద్ధికి నిరంతరం కృషి చేసారని పేర్కొన్నారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోనే పెద్ద ఐటిడిఏలో అనేక సమస్యలను పరిష్కరిస్తూ విధులు నిర్వహించారన్నారు. వరదలు, తుఫానుల సమయంలో సమయస్పూర్తితో వ్యవహరించి సమస్యలను పరిష్కరించారని చెప్పారు.



పిఒకు జ్ఞాపిక ఇస్తున్న కలెక్టర్

మన్యంలో పని చేయడం అదృష్టం : పిఒ

పోలవరం ప్రాజెక్టుకు బదిలీపై వెళుతున్న ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో పని చేయడం అదృష్టమన్నారు. అందరి సహకారంతో గిరిజనులకు సంతృప్తి కరమైన సేవలు అందించానని చెప్పారు. 516 ఇ జాతీయ రహదారికి భూ సేకరణ చేయడం సంతృప్తి నిచ్చిందన్నారు. ఏజెన్సీలో శాశ్వత స్థిరాస్తులు నిర్మించామన్నారు. మారు మూల గ్రామాలకు రహదారుల నిర్మాణానికి రూ.400 కోట్లుతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. పి.యం జన్ మన్ కింద 554 గృహాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి.ఎఫ్.ఓ, పి.వి. సందీప్ రెడ్డి, డి.ఆర్.ఓ. కె.పద్మలత, సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని తదితరులు సన్మానించారు. ఈ సమావేశంలో పిఒ తల్లిదండ్రులు, డి ఆర్ డి ఏ పి డి వి. మురళి, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.సంద్, ఏపి ఎం ఐపి పిడి రహీమ్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ జి.డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినుల అస్వస్థతపై విచారణ

ఆరుగురికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-వై.రామవరం

వై.రామవరం మండలం చవిటిదిబ్బలు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 14 మంది విద్యార్థినుల అస్వస్థత శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. 14 మంది కెజిబివి విద్యార్థినుల అస్వస్థతపై వివిధ దిన పత్రికలలో వచ్చిన వార్తలకు స్పందించిన కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, డిప్యూటీ డిఇఒ మల్లేశ్వరరావు, ఎడిఎంహెచ్ఒ డాక్టర్ శిరీషను విచారణకు ఆదేశించారు. దీంతో వారు శుక్రవారం పాఠశాలను సందర్శించిన పిల్లల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందుతున్న మెనూను పరిశీలించారు. కూరగాయలు, బెండకాయలు, వంకాయలు వాడిపోయి ఉండటంతో సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు వెంటనే టెండరుదారునికి ఫోన్ చేసి ఏ రోజు కూరగాయలు ఆ రోజు పంపించాలని కోరారు. పాఠశాలలో తాగునీటి వనరులు మరమ్మతులు గురవడంతో వారం రోజులకు సరిపడా మినరల్ వాటర్ తెప్పించాలని సూచించారు. సరైన బాత్రూంలో లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సంఘటనపై ఆరుగురికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని స్వామినాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

ఆహార కలుషితం అవాస్తవం : కలెక్టర్

పాడేరు : వై.రామవరం మండలం చవిటిదిబ్బలు కెజిబివిలో ఎటువంటి ఆహార కలుషితం జరగలేదని, నీటి కాలుష్యం లేదని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. విచారణ జరిపిన అధికారుల నివేదిక ప్రకారం ఈనెల 5న శ్రావ్య అనే 9వ తరగతి విద్యార్థినికి వాంతులు అవటంతో చవిటిదిబ్బలు పీహెచ్సీకి తీసుకెళ్లారని, మిగిలిన 13 మంది విద్యార్థినులు వేరు వేరు కారణాలతో పిహెచ్‌సికి తరలించి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. శ్రావ్యను రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు హాస్పిటల్‌కు పంపించి ఐసియులో చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థినులందరికీ టైఫాయిడ్, మలేరియా వంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒకటి రెండు రోజులలో డిశ్చార్జ్ చేయడం జరుగుతుందన్నారు. కేజీబీవీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందించడం జరుగుతోందని చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండంద్రులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



విచారణ చేస్తున్న అధికారులు, చిత్రంలో సిపిఎం నేత వాణిశ్రీ తదితరులు

గిరిజన బాలికల పట్ల నిర్లక్ష్యం ఎందుకు?

- అస్వస్థతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-వై.రామవరం

గిరిజన బాలికల పట్ల నిర్లక్ష్యం తగదని, కెజిబివిలో విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు కె.శాంతిరాజు డిమాండ్ చేశారు. కెజివిబి విద్యార్థినులు 13మంది గురువారం విరోచనాలు, వాంతులతో అస్వస్థతకు గురై పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న వారిని నేతలు వాణిశ్రీ, శాంతరాజు, జి.మల్లిఖార్జునరావు గురువారం పరామర్శించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. స్కూల్‌లో భోజనం సక్రమంగా వండడం లేదని, దీంతో భోజనం చెయ్యడానికి చాలా ఇబ్బంది పడుతున్నమని బాలికలు చెప్పారు. బాత్ రూమ్‌లు సరిపోవడం లేదని, డారిమేటరీ సరిపోక క్లాస్ రూమ్‌ల్లో పడుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం పప్పు అన్నం, సాయంత్రం బీట్ రూట్ కూరతోపాటు ఉడికీఉడకని భోజనం పెట్టడం వల్లనే పిల్లలు అస్వస్థతకు లోనైనట్లు తమ పరిశీలనలో తేలిందని చెప్పారు. కెజిబివి ఎస్ఒ నిర్లక్ష్యంతో పాటుపై అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ సంఘటన జరిగిందని పేర్కొన్నారు. 13 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైతే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎక్కడున్నారని, డిప్యూటీ డైరెక్టర్ ఏమయ్యారని, సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రెండోసారి ఇలాంటి సంఘటనలు జరిగిందని, దీనికి అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని, ఈ సంఘటన పైఅధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో చేరాలని కోరుతూ ఆ కళాశాల ప్రిన్సిపల్ వి.శంకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన సీలేరులోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఏపీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మార్చిలో జరగనున్న పదవ తరగతిలో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి విద్యార్థు సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలన్నారు. తమ కళాశాలలో సిఇసి, హెచ్ఇసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐఐటీల కన్నా ఉన్నతమైనవి ఐఏఎస్, ఐపిఎస్‌లు అని పేర్కొన్నారు. సమాజ సేవ చేయాలన్న సంకల్పం ఉంటే దానికి గొప్ప దారి ఐఏఎస్, ఐపీఎస్, ఏపీపీఎస్‌సి వంటి ఉన్నత చదువులపై విద్యార్థులు దృష్టి సారించాలని కోరారు. వీటిలో ప్రావీణ్యత పొందాలంటే సిఇసి, హెచ్ఇసి గ్రూపులను ఎంచుకోవాలని సూచించారు. సీలేరు జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, డిజిటల్ క్లాసులు నిర్వహణ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యాబోధన చేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే మధ్యాహ్న భోజనం పథకం కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఉన్నట్లు చెప్పారు. తల్లిదండ్రుల ఆధార్, బ్యాంక్ అకౌంట్, విద్యార్థి రెండు పాస్ ఫోటోలు, టెన్త్ క్లాస్ హాల్ టికెట్, మార్క్ మెమో, విద్యార్థి ధ్రువీకరణ పత్రంతో ఇంటర్ బోర్డు నిర్ణయించిన ఫీజు చెల్లించి చేరవచ్చని చెప్పారు. పూర్తి వివరాలు కోసం విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంప్రదించాలని సూచించారు. ఈ



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకరరావు

సంపద కేంద్రాలను పరిశీలించిన డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని పలు గ్రామంలో నిర్మించిన చెత్త నుండి సంపద కేంద్రాలను రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి కె.నర్సింగరావు శుక్రవారం తనిఖీ చేపట్టారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, జడ్డంగి, అమీనబాద్, దూసరిపాము, రాజవొమ్మంగి గ్రామ పంచాయతీలలో చెత్త నుండి సంపద కేంద్రాలను డిఎల్పిఓ నర్సింగరావు శుక్రవారం పరిశీలించి వాటిని తక్షణమే వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆయన పలు పంచాయతీల కార్యాలయాలను తనిఖీలు నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి కె.కోటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ చవలం తమ్మన్నదొర, పలు పంచాయతీల కార్యదర్శులు, మండల కంప్యూటర్ ఆపరేటర్ కె.మనోహర్ పాల్గొన్నారు.



సిబ్బందికి సూచన చేస్తున్న డిఎల్‌పిఒ నర్సింగరావు

గిరిజన మహిళలపై ఒడిశా సిఎం అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి -హుకుంపేట:గిరిజన మహిళలపై ఒడిస్సా సీఎం అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని ఆదివాసి గిరిజన మహిళ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కౌసల్య, ఎస్.హైమావతిలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, గిరిజన మహిళలను ఉద్దేశించి ఒడిస్సా ముఖ్యమంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు.ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో గిరిజన మహిళల మనోభాలను దెబ్బతీశాయని, క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన మహిళల అందం గురించి అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు.

11వ తేదీలోపు సర్వే చేయించుకోవాలి

ప్రజాశక్తి- జి.మాడుగుల: పిఎం జన్మ పథకం కింద పివిటీజీలకు గృహ నిర్మాణాల మంజూరుకు ఈనెల 11 వ తేదీ లోపు లబ్ధిదారులు ఇంజనీరింగ్ అధికారులతో సర్వే చేయించుకోవాలని హౌసింగ్ పీడీ బాబు నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. చివరి విడతగా 768 పివిటిజి గృహ నిర్మాణానికి అర్హులైన వారిని గుర్తించామని, గడువు తేదీ లోపు వారు త్వరగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జేఈ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలోని మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్‌తో బైక్ లపై ప్రయాణిస్తూ పట్టుబడ్డ యువకులకు శుక్రవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవిందరావు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీ నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలతో వాహనదారులు గాయాలపాలవుతూ మృత్యువాత పడుతున్నారని, వీరిలో యువకులు, మైనర్లే ఉన్నారని తెలియజేసారు.ఆ ప్రమాదాల్లో గాయపడి మృతి చెందిన వారి కుటుంబాల ప్రస్తుతం పరిస్థితులపై వివరించారు. సురక్షిత ప్రయాణం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. బాధ్యతా రాహిత్యంతో వాహనాలు నడుపుతూ. ప్రాణాల మీదుకు తెచ్చుకోవద్దని సూచించారు. నియమ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్వారీ లారీలతో రోడ్లు ఛిద్రం

ప్రజాశక్తి- రోలుగుంట:రోలుగుంట మండలంలో క్వారీ లారీలతో ఆయా గ్రామాల వాసులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని బుచ్చంపేట, గొల్లపేట గ్రామస్థులు తమ గ్రామాల నుంచి లారీలు తిరగకూడదని, వీటితో రోడ్లు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బుచ్చంపేట గ్రామస్థులు లారీలను అడ్డుకోగా గత రెండు రోజుల క్రితం గొల్లపేట గ్రామస్థులు కూడా లారీలను అడ్డుకున్నారు.తాము ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారులు కూడా ఎక్కడా కనిపించడం లేదంటూ ఆయా గ్రామస్థులు అంటున్నారు.

ఇదిలా ఉండగా తాజాగా గురువారం రాత్రి కొవ్వూరు గ్రామంలో క్వారీ లారీ ఢీకొట్టడంతో మూడు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో ఆ ప్రాంతంలో అంధకారం నెలకొంది. గ్రామంలోని యువకులు, ప్రజలు రాత్రి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినప్పటికీ ఎవరు ఎటువంటి చర్యలు తీసుకోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సమస్యకు పరిష్కారం చూపాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గ్రామ యువకులు తెలిపారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:అనకాపల్లి జిల్లా ,బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో ఎన్ టిఎస్ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పై ఉపాధ్యాయుడు లైంగిక దాడి చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి గౌతమ్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఇలాంటి సంఘటనలు చాలా జరిగినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం నేరస్తులను శిక్షించ లేదన్నారు. హోం మంత్రి జిల్లాలో ఇలాంటి అత్యాచారాలు తరచూ జరుగుతుంటే స్పందించకపోవడం సరికాదన్నారు. లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడుపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు విజయ్, డివిజన్ సభ్యులు సాయి, గణేష్, స్వామి, గణేష్, రవి, శివాజీ పాల్గొన్నారు.

ఆదివాసీలకు తప్పని డోలి మోతలు

-3 కిలోమీటర్లు కాలినడకన ఆస్పత్రికి తరలింపు
-గతంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి
- ప్రారంభం కాని పనులు - అవస్థలు పడుతున్న గిరిజనులు


డోలిలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి అరకులోయ రూరల్:అల్లూరి సీతారామ రాజు జిల్లా అనంతగిరి మండలం పిన్నకోట పంచాయతీ రాచకిలం మారుమూల గ్రామానికీ చెందిన గెమిల సింహాచలం జ్వరంతో బాధపడుతుండడంతో శుక్రవారం వైద్య సేవల నిమిత్తం పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డోలి మోతతో తరలించారు. వైద్యాధికారి వైద్య సేవలు అందించినా జ్వరం తగ్గక పోవడంతో సరైన రోడ్ సౌకర్యం లేక డోలి మోతతో డోలి కట్టి ఆసుపత్రికి తరలించారు. అదే గ్రామానికి చెందిన సూకురు దేవుడమ్మ 8 నెలల నిండు గర్భిణీ. పరీక్షల నిమిత్తం పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వీరిద్దరిని మూడు కిలోమీటర్ వరకు డోలి కట్టి కొంత దూరం వరకు తీసుకొచ్చారు. ఆ తర్వాత ఓ ప్రైవేట్ ఆటోలో ఆసుపత్రికి తరలించారు.

గెమిలి సింహాచలం గత ఐదు రోజుల నుండి జ్వరంతో బాధపడుతున్నారు. పిన్నకోట వైద్య సిబ్బంది, రాచకీలం గ్రామాన్ని సందర్శించి వైద్యం అందించినా జ్వరం తగ్గిపోవడంతో పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఇదిలా ఉండగా గత డిసెంబర్ 22వ తేదీన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేకించి కొండ శిఖర గ్రామాలకు గుమ్మంతి నుండి రాచకిలం నుండి రెడ్డిపాడు గ్రామానికి రోడ్డు నిధులు మంజూరు చేసి, శంకుస్థాపన చేశారు. నేటికీ పనులు ప్రారంభించక పోవడంతో తమ గ్రామాలకు డోలీ మోతలు తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ గ్రామాలతో పాటు మూడు పంచాయతీలు పిన్నకోట, జీనపాడు, పెద్దకోట పంచాయతీ పరిధిలో 11 గ్రామాలు 1500 మంది జనాభా ఈ రోడ్డు ద్వారా నిత్యం ప్రయాణం చేస్తున్నారు. బలగరువు నుండి దాయిర్తి రోడ్డు పనులకు నిధులు మంజూరైనా ప్రారంభించక పోవడంతో డోలి మోతలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డోలీ మోతను అరికట్టి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ పరిధి విజయానందపురం గ్రామం సమీపంలో శుక్రవారం బస్సు ఢీకొని పల్లా పరదేశి మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి పల్లా పరదేశి, బంగారయ్య అన్నదమ్ములిద్దరూ విజయనగరంలో నివాసముంటున్నారు. వీరిద్దరూ సొంత గ్రామంలో పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వేర్వేరు సైకిళ్లపై పొట్నూరుకు వస్తున్నారు. విజయానందపురం గ్రామం సమీపంలో ఉన్న సిమెంట్ పైపుల కంపెనీ వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో వస్తున్న ఆనందపురం మండలం గిడిజాలలోని సాయి గణపతి పాలిటెక్నికల్ కళాశాలకు చెందిన బస్సు పల్లా పరదేశిని ఢీకొట్టింది. పది అడుగుల దూరం వరకు ఈడ్చుకు పోయింది. పరదేశి సోదరుడు బంగారయ్య కేకలు వేసినప్పటికీ బస్సు వెంటనే ఆగలేదు. పరదేశి కాళ్లపై నుంచి బస్సు వెళ్లిపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పరదేశి భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రోజు కూలి నిమిత్తం విజయనగరం నుంచి రోజూ తిరుగుతున్న పరదేశి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కూలి తప్ప మరే ఆదాయంలేని ఆ కుటుంబం రోడ్డు పడిందని గ్రామస్తులు విచారం వ్యక్తంచేస్తున్నారు.

విభాగాల పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ శుక్రవారం పరిపాలనా, రెవెన్యూ, అలాట్‌మెంట్, సాంకేతిక, ప్రణాళికా విభాగాల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల పనితీరును సమీక్షించారు విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో అన్ని పార్కుల్లో రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు తప్పక పనిచేసేలా చూడాలని, అదేవిధంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఇంజినీరింగ్ పనుల అంచనాలను రూపొందించాలని ఆదేశించారు.

విద్యా రంగ పరిరక్షణకు కృషి

పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - భీమునిపట్నం

విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషిచేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి స్పష్టం చేశారు. విశాఖ జిల్లా భీమిలిలో యుటిఎఫ్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఫిబ్రవరి 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన తర్వాత గెలుపొందిన ఎమ్మెల్సీలు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)గా ఏర్పడి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు, పింఛనుదారులు, నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలిలోను, వెలుపలా పోరాటాలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అనేక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. కెజిబివి, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు, అప్రెంటిస్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్లు, కాంట్రాక్టు అధ్యాపకుల మినిమం టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ పరిష్కారంలో సంఘాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సమావేశంలో యుటిఎఫ్ ప్రతినిధులు సంతోష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతా

ఆరిలోవ : తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి చెప్పారు. యుటిఎఫ్ బలపరచిన విజయగౌరి శుక్రవారం ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపకులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తోందని, విద్యను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారని, పిల్లలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై పని భారం, ఒత్తిడి పెరుగుతున్నాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ఇతర అనేక సమస్యలపై పోరాడిన అనుభవం తనకు ఉందని, మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానని చెప్పారు. ఇప్పటివరకు ఉత్తరాంధ్ర నుంచి టీచర్ ఎమ్మెల్సీగా ఎన్నికైన వారు శాసనమండలిలో ఏ ఒక్క సమస్య మీదా మాట్లాడలేదన్నారు. ఒక మహిళా అభ్యర్థిగా, ఉద్యమ నాయకురాలిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు నరేంద్రకుమార్, శంకర్, నాగరాజు, రంగమ్మ, రవణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజవొమ్మంగి గ్రామానికి చెందిన భవననిర్మాణ కార్మికుడు హెచ్ఎం బుజ్జికి స్థానిక శ్రీవిఘ్నేశ్వర తాపీ మేస్త్రీల సంఘం నాయకులు శుక్రవారం రూ.6వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తాపీమేస్త్రీల సంఘం మండల అధ్యక్షులు సిగిరెడ్ల వీరబాబు మాట్లాడుతూ తమ సంఘం సభ్యులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే సంఘం తరుపున ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్.రామకృష్ణ, పినపాత్రుల బుజ్జి, టి.నూకరాజు, వి.దుర్గాప్రసాద్, పి.నాగు, హెచ్చం శ్రీను, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 5వ రోజు 4 నామినేషన్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం మరొక నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. పిఆర్‌టియు మద్దతుతో బరిలోకి దిగిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నూకల సూర్యప్రకాష్, రాయల సత్యన్నారాయణ, పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు ఆయన కార్యాలయంలో నామినేషన్లు, సంబంధిత పత్రాలను సమర్పించారు. ఈ క్రమంలో అభ్యర్థులందరితో జిల్లా కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఇదిలా ఉండగా ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు గడువు కాగా ఇప్పటికే అయిదు రోజుల గడువు అయిపోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం ఒక్క రోజే నామినేషన్లు వేయడానికి గడువు ఉంది. ఇప్పటి వరకు ఎనిమిది నామినేషన్లు దాఖలవగా అభ్యర్థులు 14 సెట్లు సమర్పించారు. ఎఆర్ఒ, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, నోడల్ అధికారి, విఎంఆర్‌డిఎ ఎస్టేట్ అధికారి దయానిధి, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది అభ్యర్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారు.

శ్రీనివాసులు నాయుడు ర్యాలీ

మాజీ ఎమ్మెల్సీ, పిఆర్‌టియు మద్దతుతో ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు ముందుగా జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లో ఖాజీపేట - విజయవాడ సెక్షన్‌లో ఖమ్మం వద్ద ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా 18111 టాటానగర్ - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఫిబ్రవరి 13న, 18112 యశ్వంతపూర్ - టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను ఫిబ్రవరి 9, 16 తేదీల్లో రద్దు చేశారు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహా కుంభమేళా ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

మహా కుంభమేళా నేపథ్యంలో ప్రయాణికులు, యాత్రికులు, భక్తుల అదనపు రద్దీని నియంత్రించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే కుంభమేళా ప్రత్యేక రైళ్ల సేవలను మరో రెండు ట్రిప్పులు పెంచాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08588 విశాఖపట్నం - గోరఖ్‌పూర్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 10, 22 తేదీల్లో రాత్రి 10:20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి ఫిబ్రవరి 12, 24 తేదీల్లో రాత్రి 19.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. 08587 గోరఖ్‌పూర్ -విశాఖపట్నం ప్రత్యేక రైలు ఫిబ్రవరి 13, 25 తేదీల్లో సాయంత్రం 17.45 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయలుదేరి ఫిబ్రవరి 15, 27 తేదీల్లో 15.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

దరిచేరని లక్ష్యం

నిరాశాజనకంగా ఉద్యానశాఖ ప్రగతి
ఆయిల్ పామ్ సాగు అంతంతే..

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఉద్యాన శాఖ ఈ ఏడాది పథకాల లక్ష్యాన్ని చేరుకునేలా లేదు. ఆర్థిక సంవత్సరం మరో 50 రోజుల్లో ముగియనుండగా గడిచిన కాలమంతా నిరాశాజనకంగానే ఆ శాఖ ప్రగతి ఉంది. లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించి, అధిక ఆదాయాలు రాబట్టడానికి ఉద్దేశించిన పథకాలు రైతుకు సంపూర్ణంగా చేరడంలేదు. గ్రామాల్లో రైతుకు అవగాహన కల్పించకపోవడం, నిధుల సమస్య వెరసి పథకం అమల్లో ప్రగతి ఆశించిన స్థాయిలో లేదు. ప్రధానంగా ఆయిల్ పామ్ పథకం అమలు నిరాశాజనకంగా ఉంది. రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కెవివై) పథకం కింద నూతన తోటల పెంపకం, బొప్పాయి సాగు, టిష్యూ కల్చర్ అరటి, అల్లం, మామిడి, జీడి మామిడి, కూరగాయల సాగు విస్తీర్ణం విస్తరించాల్సివుంది. ఆర్‌కెవివై పథకం కింద యూనిట్ విలువలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సివుంది. రెండు ప్రభుత్వాల నుంచీ సరిగా నిధులు రాలేదు. అవగాహన కలిగిన రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపుతున్నా సకాలంలో నిధులు రాక ఉత్సాహంగా పంట సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. మధ్య తరగతి రైతులకు అవగాహన లేక ఈ పథకాలను ఉపయోగించుకోలేని స్థితి ఏర్పడింది.

జిల్లాలో ఆర్‌కెవివై పథకంలో భాగంగా మామిడి, జీడి తోటలు, కొబ్బరి, బొప్పాయి, కూరగాయల సాగులో లక్ష్యాలు చేరుకోవడం దగ్గరగా వున్నప్పటికీ, ఆయిల్ పామ్ పథకం లక్ష్యానికి దూరంగా వుంది. ఆయిల్ పామ్ పథకం కింద స్వదేశీ రకం మొక్కలతో 775 ఎకరాల్లో కొత్తగా సాగుచేయాలని ప్రణాళిక తయారుచేసుకున్నప్పటికీ 82 ఎకరాలకే పరిమితమైంది. విదేశీ రకం మొక్కల ఆయిల్ పామ్ సాగు 3,100 ఎకరాల్లో సాగుచేయాలని భావించినా, ఇంతవరకు 1050 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైంది. అయిల్ పామ్ తోటల్లో అంతర పంటల సాగు ఆ మేరకు అనుకున్నట్లు జరగలేదు. ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో అంతర పంటలు వేయాల్సివుండగా, 40 ఎకరాల్లో సాగు చేయగలిగారు.


సాగులో ఉన్న ఆయిల్ పామ్

జిల్లాలో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార చక్కెర ఫ్యాక్టరీల క్రషింగ్‌ను ప్రభుత్వం నిలిపివేయడంతో చెరుకు సాగు విస్తీర్ణం లక్ష ఎకరాల నుంచి 20 వేల ఎకరాలకు పడిపోయింది. చెరుకు సాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నా ఆ పథకాలు సరిగా అమలుకావడంలేదు. దీంతో ఆహార, ఉద్యాన పంటల స్థానంలో జాతీయ రహదారికి అనుకొని వున్న మండలాలతో పాటు అచ్యుతాపురం, రాంబిల్లి, సబ్బవరం సహా అనేక మండలాల్లో వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ కింద మారుతున్నాయి.

పాడేరు-భద్రాచలం బస్సు పునరుద్ధరణపై హర్షం



బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న బస్సు

ప్రజాశక్తి-సీలేరు

పాడేరు ఆర్టీసీ డిపో అధికారులు పాడేరు-భద్రాచలం బసు సర్వీసును పునరుద్ధరించడంతో దారకొండ, సీలేరు, డొంకరాయి, మోతుగూడెం ప్రాంతాలు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. 2024 సెప్టెంబర్ 8న వరద బీభత్సానికి జీకే వీధి నుంచి సీలేరు వరకు ప్రధాన రహదారి అస్తవ్యస్తం కావడంతో ఈ బస్సు సర్వీసును నాడు రద్దు చేశారు. అప్పటి నుంచి ఈ బస్సును పునరుద్ధరించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ బస్సును పునరుద్ధరించాలని ప్రయాణికుల డిమాండ్, పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు స్పందించి గురువారం నుండి ఈ బస్సును పునరుద్ధరించారు.

ఈ బస్సు పాడేరులో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి వయా చింతపల్లి, జికె.వీధి, సీలేరు, డొంకాయి, మోతుగూడెం, చింతూరు మీదుగా భద్రాచలం సాయంత్రం 5 గంటలకు చేరుకుంటుంది. అదే రోజు రాత్రి 8 గంటలకు భద్రాచలంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు పాడేరు చేరుతుంది. అలా కాకుండా మరసటి రోజు ఉదయం 8.30 గంటలకు భద్రాచలంలో బయలుదేరే విధంగా సమయం మార్పు చేస్తే ప్రయాణానికి అనువుగా ఉంటుందని ఈ ప్రాంత ప్రయాణికులకు కోరుతున్నారు.


స్కౌట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఆశ్రమ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు-1 పాఠశాల విద్యార్థులకు స్కౌట్‌లో శిక్షణ ఇచ్చారు. స్కౌట్ మాస్టర్‌గా శిక్షణ పొందిన ఈ పాఠశాల పూర్వ విద్యార్థి ప్రధానోపాధ్యాయులు ప్రోత్సాహంతో 32 మంది విద్యార్థులతో ఒక యూనిట్‌ను తయారు చేశారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ స్కౌట్ వల్ల సహాయం చేసే గుణం, సేవా దృక్పథం, క్రమశిక్షణ, సమయపాలన వంటివి విద్యార్థులకు అలవడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ మోహన్, వ్యాయామ సంచాలకుడు కురుసా శివప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరి కుప్ప దగ్ధం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన సోయం గంగరాజు అనే పేద రైతు వరి కుప్ప దగ్ధమైంది. ఈ వరి కుప్పకు దగ్గరలో ఉన్న ముళ్ల పొదలకు నిప్పు అంటుకొని, నిప్పురవ్వలు వరి కుప్పపై పడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు పినబోయిన శ్రీను ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అయితే అగ్ని మాపక శకటం వచ్చే సమయానికి వరి కుప్ప పూర్తిగా కాలిబూడిదైంది. కుటుంబ సభ్యులు సంవత్సరమంతా కష్టపడి పండించిన వరి పంట కాలిబూడిద కావడంతో బాధిత రైతు గంగరాజు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఈ రైతుకు న్యాయం చేయాలని గొల్లగూడెం ప్రజలు కోరుతున్నారు.

దొడ్డవరం విఆర్‌పిని విధుల నుండి తొలగించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మర్రివాడు పంచాయతీ పరిధి దొడ్డవరం విఆర్‌పి జుర్రా సత్యనారాయణ ఉపాధి హామీ పనుల్లో గతేడాది డిసెంబర్ నెల నుంచి అవినీతికి పాల్పడుతున్నారని, ఆయన్ను తక్షణమే తొలగించాలని పంచాయతీ సర్పంచ్ మాదల సత్యవతి, గ్రామ ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. విఆర్‌పి అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఉపాధి హామీ కూలీలతో కలిసి సర్పంచ్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. విఆర్‌పి జుర్రా సత్యనారాయణ చాలా అవకతవకలకు పాల్పడుతున్నట్లు ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వచ్చాయని తెలిపారు. విఆర్‌పి స్థానికంగా ఉండకుండా అతని బంధువుతో ఇక్కడ విధులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. విఆర్‌పిని తొలగించి స్థానికంగా ఉన్న చదువుకున్న వారు పంచాయతీలో చాలా మంది వున్నారని, స్థానికులకు అవకాశం కల్పించాలని కోరారు.

బియ్యం రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు బియ్యం ఎగుమతుల్లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ విషయాన్ని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఇక్యు -1ఎ బెర్త్ వద్ద ఎంవి ఎలేఫ్థోత్రియా నౌకలో 7,790 మెట్రిక్ టన్నుల బియ్యం సంచులను బ్రేక్ బల్క్ ద్వారా విజయవంతంగా లోడ్ చేసినట్టు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 10న ఇక్యు - 4 వద్ద ఎంవి.అమిస్ విస్డం - 2 నౌకలో రవాణా చేసిన 6,758 మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్‌నే ఇప్పటి వరకూ రికార్డుగా ఉందని, ప్రస్తుతం పోర్టు ఆ రికార్డును అధిగమించి నూతన రికార్డు నెలకొల్పిందని తెలిపారు. తాజా రికార్డు పోర్టు సమర్థతను, సామర్థ్యాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు.